క్లుప్తంగా

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన కిచ్చెన్న విజయమోహన్‌రెడ్డి వైద్య ఖర్చులకు ప్రభుత్వం రూ.90 వేలు సీఎం సహాయక నిధి కింద విడుదల చేసింది. శనివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ వార్డెన్ షబ్బీర్ బాషా శనివారం తెలిపారు. వసతి గృహంలో 2023–24 విద్యాసంవత్సరానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు 225 సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో 88 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈనెల చివరిలోగా బీసీ వసతి గృహంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంపీడీఓ గోపికృష్ణ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జులై 1వ తేదీ మద్దూరు గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపు నిర్వహణకు 7 రోజుల ముందు సంబంధించిన గ్రామంలో వలంటీర్లు సర్వే చేస్తారన్నారు. సర్వే నిర్వహిస్తున్న ఇళ్ల వద్ద ప్రజలతో మాట్లాడారు. ప్రజలు చెప్పే ప్రతి సమస్యను సేకరించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


విద్యాకానుక కిట్ల పంపిణీ



కిట్లు విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పీఎంసీ ఎం. మహబూబ్‌బాషా

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పీఎంసీ చైర్మన్ ఎం.మహబూబ్‌బాషా చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారన్నారు. మనబడి నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబూకాసీం, ఉపాధ్యాయులు సమీనా బేగం, అమీనా బేగం తదితరులు ఉన్నారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు



అక్రమ లే అవుట్లను తనిఖీ చేస్తున్న కుడా అధికారులు

ఆత్మకూరు: అక్రమ లే అవుట్లు వేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు విజయభాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణ ప్రాంతంలోని చక్రం హోటల్ వెనుక భాగంలోని 851 సర్వే నంబరులోని 8 ఎకరాల భూమిలో, శ్రీశైలం రోడ్డు మర్రిమాను, నంద్యాల రోడ్డు మార్గంలో వెలసిన అనుమతి లేని లేఅవుట్లు, వెంచర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక సంఘం కూడాలో విలీనం అయినందున కొత్తగా వేసి లే అవుట్లు, వెంచరు యాజమానులు నియమ నిబంధనలు పాటించాలన్నారు. వెంచర్లు వేసే ప్రతి ఒక్కరూ ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలని, 40 అడుగుల రోడ్డు వేసి 10 శాతం ఓపెన్ స్పేస్ పురపాలక సంఘానికి ఇవ్వాలని సూచించారు. పురపాలక సంఘం వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, కూడా ప్లానింగ్ ఆఫీసర్ సునీల్‌రాజు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అన్ని రకాల సేవలు

మహానంది: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని బండిఆత్మకూరు ఏఓ స్వాతి తెలిపారు. బండిఆత్మకూరులో శనివారం రైతుభరోసా కేంద్రంలో జీలుగలు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ పదకొండు క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. బీపీటీ–5204 రకం, ఇతర వరిరకం విత్తనాలు కావాల్సిన వారు ముందస్తు సమాచారం అందిస్తే సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పశు బీమా.. పాడిరైతుకు ధీమా



బీమా ప్రీమియం వివరాలు

ఆవులు/గేదెలు బీమా మొత్తం	కాలపరిమితి	బీపీఎల్/ఎస్సీ/ఎస్టీల వాటా	ఏపీఎల్ (రేషన్ కార్డులేని వారు)
రూ. 30,000	మూడేళ్లు	రూ.384	రూ.960
రూ. 15,000	మూడేళ్లు	రూ.192	రూ.480
గొర్రెలు/మేకలు/పందులు			
రూ.6,000	ఏడాది	రూ.36	రూ.90
రూ.6,000	రెండేళ్లు	రూ.54	రూ.135
రూ.6,000	మూడేళ్లు	రూ. 75	రూ.187.50

- తక్కువ ప్రీమియంతో మూడేళ్ల వరకు పశువులకు బీమా
- మృత్యువాతపడినా, ప్రమాదానికి గురైనా వర్తింపు
- ఆర్బీకేల్లో పశువులకు నమోదు చేయించుకొనే అవకాశం

జూపాడుబంగ్లా: కన్నబిడ్డల్లా కంటికిరెప్పలా కాడుకొన్న ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, పందులు, పాడిపశువులు అనారోగ్యం, ప్రమాదవశాత్తు మృత్యువాతపడితే పోషకుల బాధ వర్ణనాతీతం. వాటిస్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. అలాంటి రైతులకు, పాడిపోషకులకు అండగా నిలిచి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకాన్ని చేర్పులు, మార్పులుచేసి కొత్తగా దీనిని అమలు చేస్తున్నారు.

అన్నిరకాల పశువులకు బీమా

పశుపోషకులు గరిష్టంగా ఐదు గేదెలు, 50గొర్రెలు లేదా మేకలు, లేదా పందులకు బీమా చేయించుకునే అవకాశం ఉంటుంది. ఈ పథకంలో పాలిచ్చే పశువులు, పాలివ్వని పశువులకు సైతం బీమా పొందే అవకాశం ఉంది. గతంలో కేవలం పాలిచ్చే పశువులకు మాత్రమే బీమా వర్తించేది. ఎద్దులు, ఆవులు, మేకలు, పందులు, గొర్రెలకు కూడా బీమా వర్తింపజేస్తున్నారు.

తెల్లరేషన్‌కార్డు దారులు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు

తెల్లరేషన్ కార్డున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ తదితర పశుపోషకులు లబ్ధిదారుని వాటాగా 20 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు బీమా వర్తిస్తుంది. తెల్లరేషన్‌కార్డు లేకుండా, ఆర్థికంగా స్థితివంతులైన వారు 50 శాతం ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలపరిమితికి ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చును.

నియోజకవర్గంలో జీవాల వివరాలు

ఆవులు	22,380
బర్రెలు	38,345
గొర్రెలు	2,16,346
మేకలు	24,726
ఇప్పటిదాకా బీమా చేయించినవి 20 శాతం	

అన్నిరకాల పశువులకు బీమా వర్తింపజేయడం సంతోషం



నాకు ఐదు బర్రెలున్నాయి. వాటిని పోషించుకోవడం ద్వారానే నేను, నాభార్య ఉపాధి పొందుతున్నాం. గతంలో పాలిచ్చే పశువులకు మాత్రమే బీమా ఉండేది. ప్రస్తుతం అన్నిరకాల పశువులకు బీమా వర్తింపజేయడం సంతోషంగా ఉంది. పశువులు అనారోగ్యానికి గురై మృత్యువాతపడితే ఆ బాధ చెప్పనలవికాదు. గతంలో నాది ఓ బర్రె చనిపోతే పశువుల డాక్టర్లకు చెప్పి పోస్టుమార్టం చేయించాను. బీమా వస్తుందని చెప్పారు. త్వరలో బ్యాంకు ఖాతాలో డబ్బులు పడతాయని చెప్పారు.
– కుమ్మరి రంగన్న, తాటిపాడు, పశుపోషకుడు

జీవాలకు బీమా చేయించుకోవాలి



ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం ద్వారా అన్నిరకాల పశువులకు, ఎద్దులకు, ఆవులకు, గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేయించుకునే అవకాశం కల్పించింది. తక్కువ ప్రీమియం చెల్లించి ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలానికి బీమా చేయించుకోవచ్చు. ప్రీమియం కాలంలో బీమా చేయించినవి మృత్యువాతపడితే వాటికి పూర్తి ప్రీమియం మొత్తం చెల్లిస్తారు. కనుక పశుపోషకులు వాటికి తప్పకుండా ప్రీమియం చేయించుకోవడం ఉత్తమం.
– రామాంజనేయనాయక్, అసిస్టెంటు డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ

నలుగురిపై కేసు నమోదు

మిడుతూరు: పొలాన్ని ట్రాక్టర్‌తో దున్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతీశంకర్ శనివారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన వివేకానందబాబుకు బైరాపురం పొలిమెరలోని సర్వే నంబరు 4/ఏ1, 4/ఏ2లలో 4.08 సెంట్ల భూమి ఉంది. ఇదే గ్రామానికి చెందిన సోగరాజు చెంచురాజు, ఎలీషా, రవికుమార్, తాటిపాడి వెంకటరమణ ఈనెల 20న నంబర్ ప్లేట్‌లేని ట్రాక్టర్‌తో వెళ్లి ఆ పొలాన్ని దున్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారని బాధితుడు శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు

మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై..

చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఓ మహిళను దుర్భాషలాడిన పానుగంటి చిన్నన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు తెల్లవారుజామున బాధితురాలి ఇంటికి వెళ్లి తలుపు తట్టి నోటికి వచ్చినట్లు దుర్భాషలాడి అవమానించాడని స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు.

కుమారస్వామికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని శనివారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలువురు ఎమ్మెల్యే శిల్పాను కలిసి తమ సమస్యలు విన్నవించారు. పట్టణంలోని ముస్లింల శ్మశాన వాటికకు మట్టి ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని స్థానిక ముస్లింలు కోరారు. పాత హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థించారు. ఈదుల చెరువు పెండింగ్ బిల్లులు త్వరితగతిన ఇప్పించాలని నాయకులు కోరారు. సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సింగల్ విండో చైర్మెన్ వెంకటరామిరెడ్డిని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. వెంకటరామిరెడ్డి వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా శనివారం ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, తెలుగు రమణ, షంషీర్ అలీ, త్యాగరాజు ఉన్నారు.

ఎన్ని కుయుక్తులు పన్నినా మళ్లీ జగనన్నే సీఎం

- చంద్రబాబు, లోకేష్, పవన్‌లు ప్రజల్లో విశ్వాసం కోల్పోయారు
- పార్టీలకు అతీతంగా పథకాలిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదే
- జూపాడుబంగ్లా మండలంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: చంద్రబాబునాయుడు అతని కొడుకు పప్పులోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఎన్ని కుయుక్తులు పన్నినా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. శనివారం మండలంలోని మండ్లెం గ్రామసచివాలయ–2 పరిధిలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ కృపమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

అధికారదాహంతో చంద్రబాబునాయుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడ్డుకోవటంతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇక ఆయన తనయుడు పప్పుసుద్ద లోకేష్ రాష్ట్ర రాజకీయాలపై అవగాహన లేకపోయినా ఆయన నోటికొచ్చినట్లుగా మాట్లాడుతూ పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర వల్ల టీడీపీకి నష్టమే తప్ప ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ కృషిచేస్తున్నారని తెలిపారు.

మండలంలో ముగిసిన కార్యక్రమం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండలంలో ముగిసింది. మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే ఏడాదికాలంగా పర్యటించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన అన్నిశాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల కృపమ్మ, నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉస్మాన్‌బాషా, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలమైన ఆహారంతోనే క్షయ నివారణ



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజరు రవికుమార్

ఆత్మకూరు: బలమైన ఆహారంతోనే క్షయవ్యాధి నివారణ సాధ్యమవుతుందని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని అర్బన్ కాలనీలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇచ్చే సలహాలు, సూచనలు గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పాటించాలని చెప్పారు. ఆత్మకూరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆధునిక పరికరాలతో ఉచితంగా రూ. 3 వేలు విలువ చేసే గళ్ల పరీక్షలు చేస్తునట్లు తెలిపారు. వ్యాధి నివారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు వెంకటలక్ష్మి, కృష్ణకుమారి, ప్రియాంక, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ తనిఖీలు నిర్వహించాలి



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రతిరోజు తనిఖీలు నిర్వహించాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ అన్నారు. శనివారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో వెంకటసాయి ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇన్‌వాయిస్ సరిగా లేని కారణంగా 1.4 క్వింటాళ్ల మొక్కజొన్న, దాదాపు రూ.63వేలు విలువ గల విత్తనాలు విక్రయాలు నిలిపివేస్తూ సీజ్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగు మందుల వల్ల ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు అనుమతులున్న దుకాణాలు, ఆర్బీకేల్లో మాత్రమే విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

మండలంలోని వేంపెంట గ్రామంలో ఆర్బీకేను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇప్పించాలని, ఆర్బీకే ద్వారా రైతులకు అందాల్సిన సేవలు సత్వరమే అందజేయాలని సిబ్బందికి సూచించారు.

పత్తిపంటను దున్నేస్తున్న రైతులు



పత్తి మొక్కలను దున్నేస్తున్న రైతు



పంటను గొర్రెలకు వదిలేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: బోర్లు, బావుల కింద ముందస్తుగా మే మాసంలో సాగుచేసిన పత్తి పంటకు వేరుకుళ్లు(ఎర్రనాటి తెగులు) వ్యాపించటంతో మండలంలోని పి.లింగాపురం గ్రామ రైతులు పత్తిపంటను దున్నేస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన బోయవెంకటరమణ–4ఎకరాలు, తర్తూరు శ్రీను–2ఎకరాలు, బాలపుల్లి–4ఎకరాలు, బండారుబుజ్జి–4ఎకరాలు, రమణారెడ్డి–3ఎకరాలు, రమణమ్మ–2ఎకరాల పత్తి పంటను జీవాలకు వదిలేయటతో పాటు దున్నేశారు. బాధిత రైతులు విలేకరులతో మాట్లాడుతూ గతేడాది మేలో పత్తిపంటను సాగుచేసుకొన్న రైతులకు మంచి దిగుబడి, క్వింటా రూ.10వేల చొప్పున విక్రయించుకున్నారన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది బోర్లు, బావులున్న రైతులు మే మాసంలో కురిసిన వర్షాలకు బోర్లు, బావుల కింద పత్తి పంటను సాగుచేశామన్నారు. మొలకలొచ్చాక జూన్ మాసంలో ఎండలు మండిపోవడంతో పెరుగుదల తగ్గి, వే ర్లు కుళ్లిపోయి మొక్కలు ఎర్రబారి చనిపోతున్నాయన్నారు. రూ.10వేల నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇద్దరు వీఆర్వోల నియామకం

కొత్తపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న రెండు గ్రామ పంచాయతీలకు ఇద్దరు వీఆర్వోలను నియమించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న శనివారం తెలిపారు. కొక్కెరంచ వీఆర్వోగా వేణుగోపాల్, గువ్వలకుంట్ల వీఆర్వోగా చంద్రశేఖర్ సాధారణ బదీలీలలో భాగంగా వచ్చినట్లు పేర్కొన్నారు. వీరు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చినట్లు వివరించారు.

నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠినచర్యలు

మహానంది: మహానందీశ్వరుడి ఆలయ ప్రాంగణంలో నిషేధిత వస్తువులైన గుట్కా, బీడీ, సిగిరెట్, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మహానంది దేవస్థానం కార్యాలయంలో శనివారం ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహానంది ఏఈఓ సస్పెన్షన్

మహానంది: మహానంది ఏఈఓ వై.మధును సస్పెండ్ చేస్తూ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. అనుమతి లేకుండా ప్రొవిజన్స్ తెప్పించిన కారణంతో ఏఈఓను సస్పెండ్ చేయడంతో పాటు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు మెమో మరో ఉద్యోగి నీలకంఠ రాజుకు చార్జ్ మెమో జారీ చేశారు.

మట్టి తరలిస్తే చర్యలు

పగిడ్యాల: శ్రీశైలం ప్రాజెక్ట్ మునక భూముల నుంచి నల్లమట్టి, ఎర్రమట్టి, బింగమట్టి అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ భారతి హెచ్చరించారు. శనివారం నెహ్రూనగర్ గ్రామంలో వీరాపురం, మూర్వకొండ గ్రామస్తుల మధ్య ఎర్రమట్టి, బింగమట్టి తరలింపుపై వివాదం తలెత్తింది. పాత మూర్వకొండ మునక భూముల్లోని బింగమట్టిని వీరాపురం గ్రామస్తులు ట్రాక్టర్ల ద్వారా తరలించడాన్ని మూర్వకొండ గ్రామ పెద్దలు అడ్డుకున్నారు. ఈ వివాదం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో వీఆర్వో వెంకటస్వామి ఇరువర్గీయులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటికే పీకే ప్రాగటూరు నీటి మునక నది లోతట్టు భూములపై ఆర్డీఓ ఆదేశాల మేరకు 144 సెక్షన్ విధించామన్నారు.

శ్మశానవాటిక శుభ్రం

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక శ్మశానవాటికను శనివారం శుభ్రం చేయించారు. గ్రామంలో శ్మశానవాటికకు స్థలం లేకపోవడంతో కేసీ కాల్వ పరంపోగు స్థలంలో మృత దేహాలను ఖననం చేస్తున్నారు. అక్కడ చెత్తాచెదారం, ముళ్లపొదలు పేరుకపోవటంతో జేసీబీతో తొలగించి శుభ్రంచేయించారు. రమేష్‌రెడ్డి, సుంకన్న, వినయ్, వెంకటరమణగౌడు, రామకృష్ణ, శ్రీను, వెంకటశివుడు, శేఖర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



నందికొట్కూరులో అవగాహన కార్యక్రమం

నందికొట్కూరు: జగనన్న కాలనీలో నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ రఘురామ్ అన్నారు. శనివారం పట్టణంలోని జగనన్న లే అవుట్లలో హౌసింగ్ స్పెషల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహాలను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకుంటే ప్రభుత్వం బిల్లులు జాప్యం లేకుండా మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ శోభరాణి, హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు, కొణిదేల గ్రామాలలోని జగనన్న లేఅవుట్లను గృహ నిర్మాణ శాఖ ప్రత్యేకాధికారి రఘురామ్ శనివారం పరిశీలించారు.

పగిడ్యాల: స్థానిక జగనన్న లే అవుట్ కాలనీలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి లబ్ధిదారులకు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

మిడుతూరు: మండల పరిధిలోని పీర్‌సాహెబ్‌పేట గ్రామంలో హౌసింగ్ డే సందర్భంగా లే అవుట్లను ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పరిశీలించారు.

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో లబ్ధిదారులకు ఎంపీడీఓ వాసుదేవగుప్త, హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి అవగాహన కార్య క్రమం నిర్వహించారు. సర్పంచ్ సూల రాణి పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామంలో జగనన్న లే అవుట్‌ను తహసీల్దార్ రత్నరాధిక, ఏఈ హౌసింగ్ శివరామకృష్ణారెడ్డి సందర్శించారు.

సారా విక్రయిస్తే కేసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు తప్పవని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణం సమీపంలో నాటు సారా విక్రయిస్తున్న నీలిషికారి భారతి నుంచి ఐదు లీటర్లు నాటు సారా, నాగటూరు గ్రామంలో నీలిషికారి అశోక్, నీలిషికారి శ్రీనివాసులు, గొల్ల ఈశ్వరయ్య నుంచి 10 లీటర్ల నాటు సారాతో పాటు ఆటోను పోలీసులు సీజ్ చేశారు.

మట్టి నమూనాలు సేకరించాలి

వెలుగోడు: మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఏవో పవన్ కుమార్ ఆర్బీకే సిబ్బందికి సూచించారు. శనివారం వేల్పనూరు, రేగడ గూడూరు, అబ్దుల్లాపురం రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు.

శాంతికమిటీ సమావేశం

వెలుగోడు: బక్రీద్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. ఈ నెల 29న బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ జగన్ మోహన్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ లాలం రమేష్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని సచివాలయం–1,2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. భువనేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కారణం చేతనైన అర్హత ఉండి మిగిలిపోయిన వారికి లబ్ధి చేకూరుస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు అర్హులందరికీ అందాలన్నదే సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నసిరుద్దీన్, యూత్ నాయకుడు షంషీర్, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి , తెలుగు అచ్చయ్య, రసూల్ పాల్గొన్నారు.

పగిడ్యాల: స్థానిక అంబేడ్కర్ కాలనీ, కృపామందిరం కాలనీ, పాలమర్రి స్టేజీ ప్రాంతాల్లో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్య క్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

మిడుతూరు: మిడుతూరు సచివాలయం–1 పరిధిలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు జగనన్న సురక్ష సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి సుధీర్, వీఆర్వో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామసచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష ఇంటింటి సర్వేను ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యద ర్శి అనుష, వీఆర్వో శ్రీను తదితరులు పాల్గొన్నారు.